క్లుప్తంగా

భట్టిప్రోలు తహసీల్దార్‌గా పద్మావతి



భట్టిప్రోలు: భట్టిప్రోలు తహసీల్దారుగా సీహెచ్ పద్మావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆమె నెల్లూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆమెకు స్వాగతం పలికి సన్మానించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు ఇంకొల్లుకు బదిలీపై వెళ్లారు.

భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి



అద్దేపల్లి(భట్టిప్రోలు): ఎస్ఎఫ్ఐ, అంబేడ్కర్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని గురువారం భట్టిప్రోలు పరిధిలోని అద్దేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో నీలం దేవరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని అంశాలను విద్యార్థి దశ నుండే అవగాహన చేసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో బాలలకు కూడా కొన్ని హక్కులు ఉన్నాయని తెలిపారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు బాగా చదివి మంచి ప్రయోజకులు కావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హవిలా ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బూత్ కమిటీ ఏజెంట్ల సమావేశం

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు బూత్ కమిటీ ఏజెంట్లకు సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖాజీపాలెం గ్రామంలోని కల్యాణ మండపంలో మండలంలోని 34 పోలింగ్ బూత్‌లకు చెందిన ఏజెంట్లతో సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి పాల్గొని 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బూత్ ఏజెంట్ల బాధ్యతలు, కార్యాచరణ గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

గర్భిణీలకు పండ్లు పంపిణీ



బాపట్ల అర్బన్: మండల పరిధిలోని వెదుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాపట్ల జిల్లా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాము ఆధ్వర్యంలో గురువారం గర్భిణీలకు పండ్లు, బిస్కెట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ మానస ప్రియదర్శిని, డాక్టర్ వైష్ణవ కృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నూతన అర్చక కమిటీ ఎన్నిక



చెరుకుపల్లి: మండల నూతన అర్చక కమిటీని ఏర్పాటు చేయటం జరిగిందని అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నారాయణ శరత్ చంద్ర పేర్కొన్నారు. మండల అర్చక కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం పొన్నపల్లి అగ్రహారంలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. అధ్యక్షుడుగా గోవాడ బాలకోటేశ్వర స్వామి, ఆలయ ప్రధాన అర్చకుడిగా స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ, ఉపాధ్యక్షుడుగా వేదాంతం మురళీ రంగనాథ్, ప్రధాన కార్యదర్శిగా చావలి శ్రీధర్ శర్మతో పాటు 20 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇనామ్ పరిరక్షణ కన్వీనర్ వేదాంతం వరదాచార్యులు, బ్రాహ్మణ జిల్లా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బృందావనం ఫణికుమార్ పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు రావూరి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పొన్నపల్లి సత్యన్నారాయణ, మల్లెల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పన

పిట్టలవానిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఖాజీపాలెం శివారు గడ్డంవారిపాలెం, కప్పలవారిపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సీఆర్పీలు ఉన్నారు.

సచివాలయాల ఏర్పాటుతో సేవలు సులభతరం

- రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున
- వరికూటి అశోక్‌బాబుతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు



అద్దేపల్లిలో షాదీఖానాను ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున, పక్కన బౌడ చైర్మన్ మల్లికార్జునరావు, నాయకులు

కొల్లూరు : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకే చేరాయని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గురువారం మండలంలోని జువ్వలపాలెం, కొల్లూరు–3 సచివాలయాల నూతన భవనాలను బౌడా చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబులతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలలో పనుల కోసం రోజుల తరబడి తిరగడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలన్న ధ్యేయంతో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మేలు జరగడంతోపాటు, సుమారు 2 లక్షల మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాయన్నారు. కార్యక్రమంలో భాగంగా రూ.80 లక్షలతో నిర్మించిన జువ్వలపాలెం, కొల్లూరు–3 సచివాలయ భవనాలతో పాటు, జువ్వలపాలెంలో రూ. 37 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు గుంటూరు రామారావు, సర్పంచి భూపతి కిశోర్, తహసీల్దార్ వి. పుల్లారావు, ఎంపీడీఓ లక్ష్మికుమారి, జేసీఎస్ కన్వీనర్ అయిల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాదెళ్ల నరేంద్ర, చంటి, వెనిగళ్ల శ్రీనివాసరావు, శింగం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, వరికూటి అశోక్‌బాబు

చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మొద్దు

భట్టిప్రోలు: చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. గురువారం భట్టిప్రోలు మండలంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు, బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ.. మాట మీద నిలబడే వ్యక్తి సీఎం జగన్ అయితే..మోసానికి మారు పేరు చంద్రబాబు అన్నారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండాలన్నారు. నవరత్నాల పథకాల్లో 85 శాతానికి పైగా హామీలు అమలు చేశారని కొనియాడారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ.. 34 సంక్షేమ పథకాలు అమలు చేస్తూ బడుగు బలహీన వర్గాల వారికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా వెల్లటూరులో స్మశానవాటికకు వెళ్లేందుకు వంతెన, అద్దేపల్లిలో షాదీఖానా, కోనేటిపురం, సూరేపల్లిలలో నూతన సచివాలయాలను మంత్రి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, సర్పంచులు దారా రవికిరణ్మయి, మోర్ల వెంకటేశ్వరమ్మ, మోర్ల విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు రావు రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శంఖారావం మహాసభ విజయవంతానికి పిలుపు

కర్లపాలెం: ఈ నెల 14న యానాది మహా సంఘాల ఆధ్వర్యంలో శంఖారావం రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి తెలిపారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శంఖారావం రాష్ట్ర మహాసభ గోడ పత్రికలను యానాది సంఘాల మహా కూటమి నాయకులు ఆవిష్కరించారు. 14న జరిగే శంఖారావం మహాసభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యానాది సంఘాల మహా కూటమి ప్రత్యేక సలహాదారుడు ఈగా శ్రీనివాసరావు, కోశాధికారి బెల్లంచెర్ల ప్రసాద్, ఉపాధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఓటర్ల దరఖాస్తులపై అప్రమత్తత అవసరం

అదనపు కమిషనర్ కె. రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: ఓటర్ల ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ రోల్) అనంతరం అందిన దరఖాస్తుల్ని బూత్ లెవల్ అధికారులు(బీఎల్ఓ) అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కె.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తూర్పు నియోజకవర్గ బీఎల్ఓలు, సూపర్వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం తుది జాబితా అనంతరం కూడా అనేక రకాల దరఖాస్తులు అందుతున్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. అనంతరం సూపర్వైజరీ అధికారులు సంతకం చేసి తదుపరి అనుమతుల కోసం ఏఈఆర్వోకి పంపాలని స్పష్టం చేశారు. ప్రధానంగా నూతన ఓట్ల చేర్పులు, తొలగింపు దరఖాస్తులు సూపర్వైజరీ అధికారులు, ఏఈఆర్వోలు నేరుగా పరిశీలించాలని ఆమె ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల్ని పరిశీలించి, అవసరమైన వాటి కోసం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని బీఎల్ఓలకు చెప్పారు.పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై బాధ్యత తీసుకోవాలని సూపర్వైజరీ అధికారులకు ఆమె సూచించారు. సమావేశంలో ఏఈఆర్వోలు డి.వెంకటలక్ష్మి, ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, డెప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



సూపర్వైజరీ, బీఎల్ఓలతో సమావేశమైన అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి

జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ జి.ఆశా తెలిపారు. ఇటీవల ఆసుపత్రి రైల్వే స్టేషన్ గోడ వద్ద పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో గురువారం నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ జి.ఆశా ఆసుపత్రిని పరిశీలించారు. అధ్వానంగా ఉన్న ఆ ప్రాంతాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో నెలకున్న వాతావరణాన్ని డాక్టర్ సతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ ఆమెకు వివరించారు. రెండు, మూడు రోజుల్లో ఆసుపత్రి గోడకు ఆనుకొని ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ఆశా తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, నర్సింగ్ సూపెరింటెండెంట్లు కె. ఆశా సజని, గంగమ్మ, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జీజీహెచ్ అధికారులు

ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన లింగేశ్వరరెడ్డిని కలిసిన హెచ్ఎంలు ఆయనతో పాటు ఇప్పటి వరకు ఆర్జేడీగా పని చేసి బదిలీ అయిన వీఎస్ సుబ్బారావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆర్జేడీని కలిసిన వారిలో హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ. తిరుమలేష్, గౌరవాధ్యక్షుడు జె.సురేష్‌కుమార్, నాయకులు గుత్తా శ్రీనివాసరావు, సీజే మణికుమార్, ఎన్వీ నాగమణి, కె. వీరాస్వామి, టి. శ్రీధర్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం ఉన్నారు.



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న హెచ్ఎం అసోసియేషన్ ప్రతినిధులు, ఉర్దూ డీఐ ఖాసిం

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: రెడ్డిపాలెం, నంబూరు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం – నంబూరు రైల్వే స్టేషన్ పరిధిలో సుమారు 45 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల విచారించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడు వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546, ఎస్ఐ జి.వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

నేడు నాలుగో విడత ఆసరా పంపిణీ

అమర్తలూరు(వేమూరు): వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు కోఆపరేటివ్ బ్యాంక్ వద్ద బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు యలవర్తి సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు హాజరవుతారని చెప్పారు.

ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మోటారు వాహనాల తనిఖీ అధికారి డీబీవీ రంగారావు



బాపట్ల: ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని మోటారు వాహనాల తనిఖీ అధికారి డీబీవీ రంగారావు పేర్కొన్నారు. 35వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం బాపట్లలోని ఆటో డ్రైవర్స్‌తో డ్రైవింగ్ చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీబీవీ రంగారావు మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోలో ప్రయాణీకులను ఎక్కించరాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్ ప్రసన్నకుమారి, పి.అంకమ్మరావు, బి.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం గుడివాడ గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ వీ చలం, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 11 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టాభిపురంలో నివాసం ఉండే ఓ మహిళ ఫొటోల్ని వ్యక్తి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్నాడు. గుర్తించిన మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

వృద్ధుడి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారానికి చెందిన వెంకటరమణారెడ్డి (72) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ...

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసునమోదు చేశారు. శాంతీనగర్‌కు చెందిన మల్లెల అలేఖ్య (30) వ్యక్తిగత కారణాలతో మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు మెడికల్: కార్మిక సమస్యల్ని లేబర్ డిపార్ట్‌మెంట్‌కి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని గుంటూరు జిల్లా ది చాంబర్ ఆఫ్ కామర్స్ సబ్ కమిటీ లేబర్ అసోసియేషన్ చైర్మన్ కొత్తూరు వెంకటసుబ్బారావు తెలిపారు. శ్రామిక భారతి రాష్ట్ర అధ్యక్షుడిగా, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు మెంబర్‌గా పనిచేసిన తనను సబ్ కమిటీ లేబర్ అసోసియేషన్ చైర్మన్‌గా నియమించినందుకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులుకు గురువారం ధన్యవాదాలు తెలిపారు. కార్మిక శాఖకు, వ్యాపారస్తులకు మధ్య వారధిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వెల్లటూరు తిరునాళ్లకు సర్వం సిద్ధం



భట్టిప్రోలులోని శ్రీ గణపతి స్వామివారి దేవాలయం



సిద్ధిబుద్ధి సమేత గణపతి స్వామివారు

11 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారి బ్రహోత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 15న జరుగనున్నది. దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ తిరునాళ్ల ప్రారంభమయ్యాకనే చుట్టుపక్కల ప్రాంతాలలో తిరునాళ్లు జరుగుతాయి. దేవాలయ నిర్మాణానికి పాటుపడిన తాడికొండ వంశీయులు ఏటా క్రమం తప్పకుండా బ్రహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రసిద్ధి గాంచిన 5 దేవాలయాలు ఇక్కడ ఉండటం విశేషం. ఎవరి నుంచి విరాళాలు సేకరించకుండా ఏటా నిర్విఘ్నంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.11న రాత్రి గ్రామ దేవత శ్రీ కట్లమ్మ తల్లికి నైవేద్యం అర్పించి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 12న స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుట, 13న ఉత్సవాలలో భాగంగా మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, స్వామివార్ల కల్యాణం, 14న కామ కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు, 15న లక్ష్మీ గణపతి హోమం, రాత్రి స్వామి వారి దివ్య రథోత్సవం, 16న వసంతోత్సవం, శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ ఆదిశేషాచల స్వామివారి కల్యాణం జరుగుతాయని ధర్మకర్త తాడికొండ శేషగిరిరావు వివరించారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

కర్లపాలెం: పేదల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. కర్లపాలెం పంచాయతీలోని ఎంవీరాజుపాలెం ఉన్నత పాఠశాల వద్ద గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, సినీ రచయిత కోన వెంకట్‌లు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, యాజలి సర్పంచ్ నాదెండ్ల భానుప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్, ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ అలీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

బాపట్ల: అవ్వా తాతలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి రమాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని 33వ వార్డు పరిధిలోని 19వ సచివాలయంలో వృద్ధులు, దివ్యాంగులకు కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోన రమాదేవి

పింఛన్‌దారులకు దుప్పట్లు అందజేత

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు–1 గ్రామ సచివాలయం పరిధిలోని 570 మంది సామాజిక పింఛన్ దారులకు కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు అందజేశారు. పేదవాడికి కష్టం వచ్చిందంటే కోన ఛారిటబుల్ ట్రస్టు ఎప్పుడూ ముందుంటుందని వైఎస్సార్ సీపీ నాయకుడు కోన నిఖిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు మునీర్, వైస్ ఎంపీపీ కృపానందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతకు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై చిత్రలేఖన పోటీలు

తెనాలి: తెనాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మొత్తం 20 ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6–10వ తరగతి విద్యార్థులు 600 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత నెలలో భాగంగా 'రోడ్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ సిగ్నల్స్' అంశంపై ఈ పోటీని నిర్వహించారు. కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ బలరాం, వైష్ణవి జూనియర్ కాలేజి చైర్మన్ పాటిబండ్ల శ్రీనివాసరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు, చిత్రకళా ఉపాధ్యాయుడు తురుమెళ్ల విజయప్రకాష్, అలపర్తి వెంకటేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్, పీఈటీ స్వప్న, శిరీష పాల్గొన్నారు. నిర్వాహక సొసైటీ సభ్యుడు సునీల్ పర్యవేక్షించారు. విజేతలకు 10వ తేదీన తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు జరిగే సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, కాంటినెంటల్ కాఫీ చైర్మన్ చల్లా రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులను అందజేస్తారని వివరించారు.



చిత్రలేఖన పోటీల్లో బాలబాలికలు

విలువలతో కూడిన విద్యతోనే సమాజాభివృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: విలువలతో కూడిన విద్యే సమాజాభివృద్ధికి బీజం వేస్తుందని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో గురువారం 49వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేశ్వర్ రాజేష్ మాట్లాడుతూ విద్యావంతులతోనే దేశ ప్రగతి సాధ్యమని తెలిపారు. విద్యార్థి మనోవికాసానికి దోహదం చేసేలా విద్య ఉండాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో బాలకుటీర్ ఇదే విధంగా నాణ్యమైన విద్యా విధానంతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఆకాశవాణి డైరెక్టర్ ఎం.కృష్ణకుమారి మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే మానసిక వికాసం సాధ్యమని తెలిపారు. బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారంతోనే పిల్లల సంపూర్ణ వికాసం సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలకుటీర్ ఉపాధ్యక్షుడు రావెల సాంబశివరావు, డీఈవో పి. శైలజ, పాఠశాల సహ కార్యదర్శి జయశ్రీ, సీఏవో దుర్గా రఘురామ్, ప్రిన్సిపాల్ సుధామాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంగాదేవి, రాజేశ్వర్ రాజేష్, రఘురామ్